

# వనరులు

గొప్ప రచయిత్రి, సంఘ సేవికా, స్త్రీల హక్కుల కోసం పోరాటాలు సలిపి పేరూ ప్రఖ్యాతి పొందినామె యింటర్వ్యూకి అనుమంతించిందెలాగైతేనేం. వీడియో ఫిల్మ్‌గాని, డిడిమీద గాని కనపడటం యిష్టం లేదని పబ్లిసిటీ మీద మోజు లేదన్నది.

పాత్రికేయుడు, నియమిత వేళకొచ్చి, వందనం చేసి, కుర్చీ చూపాక కూచుని, పెన్సిలూ నోట్‌బుక్ పైకితీసి పట్టుకున్నాడు.

''మీ రచనలన్నీ పబ్లిష్ అయినాయని పుస్తక ప్రదర్శన చూశాక తెలిసింది. మీరే ప్రచురించారా? పరాయి పబ్లిషర్సా? మీరే శ్రమించి ప్రచురించి వుండాలంటే, స్వంత ఖర్చుల మీదేనా? రచనలకి ఇన్‌స్పిరేషన్ యెలా పొందారు? రచనలు యిచ్చాయా? మనుషులిచ్చారా'' అన్నాడు నిదానంగా.

నీటుగా వుండి, హుందాగా కుర్చీ నిండుగా కూచుని, నవ్వు మొహంతో జవాబిచ్చింది రచయిత్రి.

''మేమే ప్రచురించి వుంటే చాలా వదిలేది. యేదన్నా అమ్మాల్సివచ్చేది. అమ్మేందుకేమీ విలువైనవి లేవు'' అన్నది.

''మరి మార్కెట్లోకి యెలా నడిచాయి పుస్తకాలు?''

''మా ఆయన ఆశావాది. ప్రగతి యిష్టం. పాత ఆచారాలు, పద్ధతులు నిరసించారు. నాకు ఇన్‌స్పిరేషన్ ఆయనే యిచ్చారు. రచనకూ ప్రోత్సాహమిచ్చారు. సమర్థత గ్రహించి పబ్లికేషన్‌కి నడుం బిగించారు. టాలెంట్‌ని మార్కెట్ చేయాలని ఆయన పట్టుదల. సమర్థులు గూడాను. మొదటి మెట్టు డబ్బు రాల్చే వనరులెక్కడున్నాయో కనిబెట్టి, ఎడెసివ్‌లాగా అతుక్కుని పని సాధించుకుని వస్తారు. నొల్లుకొచ్చిన దానితో పబ్లిషింగ్ మార్కెటింగ్ అనే శ్రమ పడతారు. నా కట్టివి ఆనందమివ్వవు. క్రిటిసైజ్ చేయగలను. తప్పులెన్నగలనుగాని, దుడుకు

నోరు కంట్రోల్ చేసుకోలేను. ''దుడుకుగల నన్నే దొరకొడుకు బ్రోచురా'' అన్నారు త్యాగబ్రహ్మం. నే వెళ్తే రాల్చరు. మీకింకా వివరాలు కావాలంటే మా ఆయన్ను యింటర్వ్యూ యివ్వమని అర్జీ పెట్టుకోవాలి'' అని లేచింది రైటరు.

అయిదు నిమిషాలు ముగిశాయి. వింతపడుతూ, ఆలోచిస్తూ విలేఖరీ లేచాడు. పరికరాలు సంచీలో పడేసి చెప్పులేసుకున్నాడు. రాజబాట మీదికొచ్చాడు.

'' ఐసీ! భర్తగారు ముందు వనరులు కనిబెడతారన్నమాట. మా పిన్ని గూడా సోర్సెస్ కనిబెడుతూ డైరక్టరు హోదాలోకెళ్లింది''. ఆటో ఆపి యెక్కి అడ్రసు చెప్పి పోనీమన్నాడు. ''వూడి పడాల్సిందే. వదిలించుకోవాలని త్వరగా యిచ్చి పంపేసే వారేమో'' దౌడు తీస్తున్న ఆటోలో కూచుని, ప్రపంచాన్ని చూశాడు విలేఖరి.

2

సీతకి తన పింతల్లి చేతులో డబ్బు యెలా ఆడుతుందో అంతుబట్టలేదు. పిన్ని చిరచిరలాడి, చిటచిటలాడుతూ తల విసురుతున్నదంటే, కొంగున గానీ, రొంటిన గానీ, చేతులో గానీ రొఖ్ఖం లేదని అర్థం. కలకలలాడుతూ, కిలకిలలాడుతుంటే మనిషినతుక్కుని రొక్కమున్నదన్నమాట. అంతవరకు రీసెర్చి చేసి గ్రహించింది సీత. సోర్సెస్ యెక్కడున్నాయో చూడటానికి పింతల్లి వెంట వెళ్లాలి. పిన్ని టక్కరి. యెవరు రాలుస్తున్నారో తెలియనివ్వదు. ఇట్టే వెళ్లి తెచ్చుకుంటుంది. ఆ నేర్పూ సమర్థతా తానూ నేర్వాలి, అనుకున్నది సీత. సీతకి డ్రాబాక్ ఏమిటంటే వడ్డీ లెక్కలు రావు. వడ్డీ లెక్కలదాకా యెందుకూ ఒట్టి లెక్కలే రావు. పిన్ని సీత యీడుదే. ఓ ఆర్నెల్లు పెద్దేమో ఇద్దరూ క్లాస్‌మేట్సే. పిన్నికి లెక్కల్లో ఫస్టు మార్కులు వస్తే సీతకి జెలసీ కలిగేది.

ఒక గెట్టుగెదర్లో సీతకి సరస్వతి పిన్ని అందింది. అంతా పరిచితులు, బంధువులూ, నవ్వుతూ పరాచికాలాడుకుంటూ సాఫ్ట్ డ్రింకులు తాగుతూ, విసుర్లూ, యెత్తి పొడుపులూ, పరాచికాలూ, గుట్టు లాగటం చేస్తున్నారు.

వంటవాళ్లు డైనింగ్ టేబిల్ మీద అందంగా వంటపాత్రలు వండిన వంటకాలతో సహా అమరుస్తున్నారు. మరో టేబిల్ మీద పళ్లాలూ గ్లాసులూ అమరుస్తున్నారు.

''బాగున్నావా పిన్నీ? సంతోషంగా కనబడుతున్నావు. తెల్లబడ్డావు. సాంబశివరావు మామయ్య అనేవాడు, డబ్బు చేరగానే తెల్లబడి నవ్వుతూ కనిపిస్తారు. డబ్బు లేనప్పుడు నల్లబడి చిరాకుపడుతూ కనిపిస్తారు''.

''ఆ సోఫాలో కూచుందామా? ఆ మూల అటే జనం లేరు. కామేశ్వరమ్మ అత్తయ్యకు, సరదాలూ వేడుకలు, ఆపేక్షా యెక్కువ. అత్తయ్య దయవల్ల కలుసుకున్నాం. సంసారం, పిల్లలూ, మగడూ, వుద్యోగంతో మునగానాం తేలానాం'' సరస్వతి పిన్నిని సోఫావేపు లాక్కెళ్లింది సీతమ్మ.

''వచ్చి నిన్ను చూసి పోవాలనే వుంటుంది సీతా. కాని నే చేసే ముష్టి వుద్యోగంతో గడిపే జీవితం జీవితమేనా? ఇంటి పట్టున వుండి వుడకేయటం వడ్డించటమే నా జీవితమంటే? తలపట్టి పోయి అలా తిరిగి వస్తాను. అంతా బావున్నారా? చిక్కిపోయినావే కూతురా! పిల్లల్ని కనటం, చాకిరీ చేయటం, కూటికీ, గుడ్డకూ రాని ముష్టి వుద్యోగం, యేదీ మానవైపాయె''.

''అదే బాగు పిన్నీ. పిల్ల పెళ్లి కెదిగింది. చదువై పో వచ్చింది. కట్నం యిస్తామని అననిదే పెళ్లి స్థిరపడుతుందా? బియిడి చదువుతానంటుంది. పిల్లవాడేమో నైట్‌క్లాసెస్‌కి అటెండౌతూ ట్యూషన్లు కుదుర్చుకున్నాడు. పిల్లనిస్తామంటారుగానీ డబ్బిచ్చే మొహాలు రావు. యెందుకొస్తారు? తండ్రి ఆఫీసరేమిటి? మున్సిపాలిటీలో గుమస్తా అయిపాయె. చెయిన్ స్మోకింగూ, పేకాట చూసి యిస్తారా? వస్తారా? తనవారిని గౌరవించటానికి అంతాపోగా మిగిలిన కొద్ది భూమీ అమ్మాల్సి వచ్చింది. ఇంకా కూనా గురుజూ యెదిగే బిడ్డలూనూ. ఆ రాబడి చాల్తుందా? నా నగలు హరించుకు పోయాయి. ఇవి నకిలీవే పిన్నీ గుర్తు తెలియటం లేదూ?'' అని నవ్వింది సీతమ్మ.

''డబ్బు అవసరం చెపుతున్నావా సీతా! నేనిస్తాలే. అంచెలమీద తీరుద్దువు గాని'' అన్నది సరస్వతమ్మ.

''ఆవలిస్తే పేగులు లెక్కపెడతావు పిన్నీ. ఆది నిష్ఠూరం మేలు. వడ్డీ తేలాలిగా'' సీత కళ్లు ఆశతో మెరిసినై.

దీపాలు కాంతివంతమై ఆనందమిచ్చినట్టే, సరస్వతమ్మ తన చేతి సంచీ విడదీసి రంగు సంచీ తీసి అటు తిరిగి లెక్కపెట్టి తీసి కవరులో వుంచి యిటు తిరిగి సీతమ్మకిచ్చింది. సంచీ మూసేసింది. కాని సీత పిన్ని మీదికి వంగి చూడనే చూసింది.

''అంతెక్కడిది పిన్నీ! కావాల్సింది చెప్పినట్టు యిచ్చావే! నోటు వ్రాయించుకోవూ'' అన్నది కవర్ దాస్తూ.

సరస్వతమ్మ కళ్లల్లో గర్వం కనబడింది. గొంతు తగ్గించింది.

''కొంత వడ్డీ రూపంలో అందింది. కొంత ఉపదేశం పొందిన భక్తులిచ్చారు. ఉపాసిస్తే పరిస్థితులు చక్కబడ్డాయిట. కొంత పూజలు చేస్తేనూ, కొంత రామాయణం గానం చేస్తేనూ, కొంత రోగాలు కుదిరిస్తేనూ వచ్చింది''.

''అప్పు తీసుకున్నవాళ్లు అసలివ్వలేదూ?''

''అసలూ యిచ్చారు. అందుకే సంచీ నిండింది''

''యెవరు? తెలిసినవాళ్లే''

''మనవడే. వాడేదో వీడియో ఫిల్మ్ తీస్తున్నాడట'' డబ్బు అయిపోయింది. యెక్కడాపుట్టలేదు'' అని విలవిలలాడుతూ ''ఫిల్మ్ పూర్తికాగానే దూరదర్శిని మీద చూపుతారు. ఛానెల్ మాట్లాడి ఒప్పించాను'' అని యేడుస్తుంటే, ''నేనిస్తా ఫిల్మ్ పూర్తి చేసుకోనాయనా అని అప్పటికప్పుడు చేతులో పోశా. సంతోషించాడు. కాని అది మరొకరి వద్ద నించి తెచ్చానని తెలియదు వెర్రినాగన్నకి. ముద్దుకి యిచ్చాననుకున్నాడట. అప్పు తీర్చాలని గుర్తు చేసేప్పటికి, ''అప్పా అదీ? అయినా అంత తీసుకోలేదు నేను'' అన్నాడు.

''వడ్డీ పెరిగింది. ఆ డబ్బు మరొకరి నడిగి తెచ్చి నీకిచ్చాను'' అన్నాను.

''వడ్డీ కూడానా?'' అని ఆశ్చర్యపోయాడు. వడ్డీ కూడా డబ్బిచ్చిన వాడికే

చెందుతుంది. నాకేం చెందదు'' అన్నా. ''అప్పెందుకు తెచ్చావూ?'' అని విసుక్కున్నాడు. ''మరి నా దగ్గరెక్కడిదీ? కొడుకులు సంపాయించి నా చేతులో పోస్తున్నారా?'' అన్నాను.

''అంతెందుకున్నది రెడీగా?'' అన్నాడు నమ్మకుండా.

''మరొకరడిగితే తెచ్చా యిద్దామని. నిరాశలో మునిగావని అవసరానికి నీ కిచ్చేశా. వాళ్లకోసం మరొకచోట తెచ్చి యిచ్చాను. ''వడ్డీ వ్యాపారం చేస్తున్నావా చిన్నమ్మమ్మా!'' అని నోరు వెళ్లబెట్టాడు నాగన్న'' అని నవ్వింది సరస్వతమ్మ.

''రండి. రండి. పదార్థాలు చల్లారిపోతున్నాయి. అందరూ వడ్డించుకు తింటున్నారు'' అని పిలుచుకెళ్లారు.

సీతమ్మ ఆశ్చర్యపోయింది. మనసులోనే అనుకున్నది అనుసరిస్తూ ''బంధువులతోనే వ్యవహారం వ్యాపారం? మనమడితోనే!''

3

నంది వెలుగు వెళ్లి పెద్దమ్మను చూసి, పెద్దత్తగార్ని చూసి వారిద్దరు యిచ్చిన అరిశలు పాతికా, మినప సున్ని వుండలు డజను, జంతికలు, చేగోడీలు తీసుకుని యింటిముఖం పట్టింది సీతమ్మ. దోవలో బస్సులో సరస్వతి పిన్ని కలిసింది.

'' ఈ మాటు పిన్నితో వెళ్లి ఒక్క సోర్సునైనా కనిబెట్టాలి. పిన్ని తెలివి తక్కువది గాదు. వనరుల్ని గోప్యంగా వుంచుతుంది. మరీ ప్రాచీనకాలంలో నీటివూటల్ని గోప్యంగా వుంచేవారట. శత్రువులకు నీటి స్థావరాలు తెలియకుండా కప్పివుంచేవారట. కొంతమంది, దాడుకి గెలవలేక పోతూ పోతూ మంచి నీటి స్థావరాలలో మందు కలిసిపోతే ఆక్రమించిన వారు తెలియక తాగి చచ్చేవారుట. పిన్నిది కొంతవరకు అదే మనస్తత్వం. కొన్ని తినుబండారాలు లంచం పెడదాం'' అనుకున్నది సీతమ్మ. తనూ నొల్లుకు రావాలి. అదీ ఐడియా.

సరస్వతమ్మ సంతోషంగా లేదు. కండక్టరుకి డబ్బు అందించింది. టికెట్ భద్రపరుస్తూ సీతను చూసింది.

''యెక్కడికే సీతా?'' అన్నది.

''పెద్దమ్మ మ్మను పెద్దత్తగార్నీ చూసి వస్తున్నా పిన్నీ. పెద్దవాళ్లయారు. మోకాలి వద్ద ఇన్ఫెక్షన్ వచ్చి లేవటం లేదని తెలిసివెళ్లాను. నేను వెళ్లేప్పటికే పెద్ద మనమరాలు వచ్చి వున్నది. దాని మొగుడు అల్లర్లలో కాల్పుల్లో గుండు తాకి పోయాడు. నీవు వినలేదేమో. రెండు కళ్లూ మెల్ల సువర్చలకి గుర్తున్నదా? దాని పిల్లలకి పెళ్లిళ్లై వెళ్లిపోయారు'' అన్నది సీత.

''గుర్తున్నది. పెద్దకొడుకు కూతురది. దాని మొగుడదేదో కొత్తగా వచ్చే విదేశీ యంత్రాల వ్యాపారం పెట్టాడన్నారు. తండ్రి సన్యసించాడన్నారు. యెన్నాళ్లున్నావేం?'' అన్నది సంచీల వంక చూస్తూ

'' ఓ పక్షం పైనే వున్నా పిన్నీ''

''పిల్లలూ మొగుడూ యిల్లూ వదిలి శాన్నాళ్లున్నావే?''

''అదే చెప్పి పోతానంటే పోనిచ్చింది గాదు పెద్దమ్మమ్మ. సువర్చలేమో ''మామ్మ పెద్దదైంది గదూ, లేచి తిరుగుతుంటే తానే చేసుకు తినేది. దవడాడుతూ వుండాలని నవ్వేది. పప్పుండలూ, జంతికలూ నవిలేది. మనం చేసి పెడదాం. సంతోషిస్తుంది'' అన్నది. అమ్మమ్మ చెపుతుంటే మేమిద్దరం తినుబండారాలు చేశాము. నా మొగుడా! సిగరెట్టు, పేకాటా కడుపు నింపుతాయి పిన్నీ. పచ్చడి మెతుకులు చాలు. పెద్దవాడు సోమూ తమ్ములూ చెల్లెళ్లతో ఆడుతూ పాడుతూ అన్నం వండేస్తాడు. వూరగాయలూ కందిపొడీ వుంటాయి. చుక్కమ్మ పెరుగుపోసి పోతుంది. ఉట్టి మీద నెయ్యి వుంటుంది. బాపమ్మ పాచి పనిచేసి అంట్లు తోమి బోర్లించి పోతుంది. దార్లు కాయటానికి పోయినావా పిన్నీ? వనరులేమీ, రాల్చలేదా'' అని నవ్వింది సీతమ్మ.

''బాగా అన్నావే సీతా. మచిలీపట్నం వెళ్లాలి. నా భక్తురాలున్నదా వూళ్లో. రాజామణి అనారోగ్యంతో మంచం పట్టిందని తెలిసి ఆదుర్దా గలిగి వెళ్తున్నా. సుస్తీ యేమిటో తెలియదు. నయం చేసి రావాలని వెళ్తున్నా'' అన్నది శాంతంగా.

''మన చిన్నప్పుడు ఫాదర్ గ్రిగొరీ కథ చదివాము పిన్నీ. రస్పుటిన్ అనే ఫాదర్ జారు ప్రభువు కొడుక్కి రక్తస్రావం ఆపేవాడట. ప్రేయరు చేసి గాయం మాన్పేవాడట. అలాగేనా?'' అని మళ్లా నవ్వింది సీతమ్మ.

''పోనీ అలాగేనందాము''

''భక్తురాలి దగ్గరెవరూ లేరూ? పిల్లలో?''

''పిల్లలు కలగలేదు. భర్తేమో హెచ్ ఆర్ డి. ఉద్యోగ నిర్వహణలో ఘటికుడు''.

''అంటే? అర్థంగాలేదు పిన్నీ''

''హ్యూమన్ రిసోర్సెస్ డైరెక్టరు. తెలివితేటలు కనిబెట్టి వుద్యోగావకాశాలు కల్పిస్తాడు. ఇంటర్వ్యూలు జరుపుతాడు''.

''భక్తురాలంటావేం పిన్నీ? ఫ్రెండ్ అనలేదేం?''

''సంతు కలగలేదని వ్యధ మొదలై హిస్టీరియాగా మారి, ఫిట్సులో కెళ్లింది. మేమప్పుడు అద్దె యింటికోసం తిరుగుతూ వారింట్లో చిన్న భాగం సౌకర్యంగా వుంటే చేరాము. ఆమె వ్యధా అవస్థా జాడ్యం చూడలేక, వ్యాయామం, పూజా, మెడిటేషన్ అలవాటు చేస్తే పరిస్థితి చక్కబడింది. ఉపదేశిస్తే పఠిస్తానంటే వుపదేశించాను. మనశ్శాంతి కలిగి గురి కుదిరింది నా మీద''. కొంగు ముడి విప్పి లెక్కచూసి ముడేసింది.

''అదా సోర్సూ'' అని లోపలే అనుకున్నది సీతమ్మ.

''తోడు వస్తావా?'' అనడిగింది సరస్వతమ్మ.

''అంతకంటేనా పిన్నీ! వీటన్నిటితో నీతో వారింటికి వస్తే బాగుండదు. ఇంట్లో పిల్లలకిచ్చి, మనకి కొన్ని దోవలోకి తీసుకుని వస్తాను. నాతో వస్తావా?'' అంటుండగా దిగే వూరొచ్చి, బస్సు ఆగింది. ఇద్దరూ దిగారు.

4

వీళ్లిద్దర్నీ చూసి పిల్లలు గంతులేశారు. ''నాన్నా! నాన్నా! అమ్మా అమ్మమ్మా వచ్చారు'' అని తండ్రి గదిలో కెళ్లి చెప్పారు. ఇల్లంతా కడిగి తుడిచి ఆర్డర్లో వుంచారిద్దరూ. పిల్లలకు తలంట్లు పోసి మంచిగుడ్డలేసి, తెచ్చినవి తినటానికిచ్చింది సీత. కొన్ని డబ్బాల్లో పోసి అల్మర్లో అందుబాటులో వుంచారు. కడుపునిండా భోజనాలు పెట్టి తామూ తిన్నారు. పళ్ల గోంగూర పచ్చడీ, ఆవకాయా మాగాయా చిన్న జాడీల్లో వుంచి కింద అందుబాటులో వుంచింది సీతమ్మ. పక్క దుప్పట్లు మార్చింది.

''పండగొస్తున్నది సీతా. కొత్త గుడ్డలు కావాలనరూ?''

''అనరు పిన్నీ. తన అప్ప చెల్లెళ్లకీ వారి పిల్లలకీ ముద్దుకి కొనిపెట్టటం, వీళ్లు చూస్తూ నించోటం అలవాటు చేశాడు నీ అల్లుడు''.

''మనం బయలుదేరుదామా సీతా! రెండ్రోజులున్నాంగా. అల్లునితో చెప్పిపోవాలా?'' అన్నది సరస్వతమ్మ.

''నీదంతా హాస్యం పిన్నీ. క్లబ్బుకి పరిగెత్తారుగా! చూడలేదూ? క్లబ్బుకెళ్లి చెప్పిరానా? పిల్లలకి చిరుతిండి అమిరిందిగా. త్వరగానే తిరిగి వచ్చేస్తాంగా! పిల్లలకలవాటే'' సంచీ అందుకున్నది సీతమ్మ.

''వచ్చేస్తాం అక్కడే వుండము. అదుగో ఆటో''.

5

పరాస్పేటలో ఆటో ఆగింది. బాడుగ చెల్లించి యింట్లో అడుగుపెట్టిన సరస్వతమ్మ మంచానికంటుకుపోయి పడుకుని వున్న రాజామణిని చూసింది. విచారంగా చూస్తూ వెళ్లి మంచం పక్కన నేలమీద కూలబడి వివరాలడిగింది.

''బల్లిలాగా మంచానికంటుకు పోయావు రాజూ. ఇది కూతురొతుంది. మా అమ్మాయే. సాయం వచ్చింది. గంపెడు బిడ్డలకి నచ్చచెప్పి వచ్చింది. చెంపమీద సున్నమెందుకు వేశారు?'' అన్నదాపేక్ష ఒలకపోస్తూ.

ఇంట్లో రాజామణి బంధువులిద్దరూ, డైరక్టరు బంధువులిద్దరూ యింటామె కామేశ్వరమ్మా తిరుగుతున్నారు.

''కింది దవడలో పన్ను నెప్పి అన్నదండీ రాజు. యేమీ తినలేకపోతున్నది. సివియర్ డీసెంట్రీ. హోమియో వైద్యుడు చూసి ఇన్‌ఫెక్షన్ అన్నాడు. నెప్పి తగ్గాలని నీరు సున్నం వేశాము. కామేశ్వరమ్మగారే వేశారు. కాని సున్నం వూడిరావటం లేదు'' అన్నది బంధువు. వారి వంక చూస్తూ పక్కన నేలమీదున్న సీతమ్మను చూపిస్తూ, ''వమా అవమ్మాయిసీత స్నానం చేసి వంట చేస్తుంది. మీరాయాసపడకండి. యేం చేయాలో చెప్పి అక్కడుంచితే చాలు. స్నానాల గది చూపించండి. వేడి కాఫీ చాలు దానికి'' అన్నది. సీతమ్మకి సైగ చేసింది. సీతమ్మ, బంధువు వెంట స్నానాల గది వేపు వెళ్లింది. చీరా తువాలు బుజాన వేసుకున్నది.

''కుంపటీ నిప్పు, యినప గరిటా తీసుకురామ్మా. సున్నం వూడదీస్తా. ధారకం లేదంటివి. కిటికీలోంచి వచ్చే సూర్య కిరణాలు చాలు'' అన్నది సరస్వతమ్మ.

''మంత్రం వేస్తారా? స్నానం చేయరూ'' నిలబడి వున్నామె అడిగింది.

''చూతురుగాని. రామనామానికి మడి అక్కర్లేదు. యెన్నాళ్లైంది మంచమెక్కి రాజూ?'' అని రాచింది సరస్వతమ్మ.

'' ఓ పక్షం కావస్తున్నదండీ, వైద్యుడు బంధువే. రెండు పూటలా వస్తాడు. యేదో గంజి తయారు చేసి తాగిస్తున్నాడు''. మరొకామె అన్నది ''నే చెపుతూనే వున్నానండీ. సరస్వతమ్మ గారికి ఫోన్ చేయించండి. ఆమె మీద రాజుకి గురివున్నది అని'' కామేశ్వరమ్మ నిలబడి చేతులు తిప్పుతూ అన్నది.

''కామేశ్వరమ్మకి కడుపే కైలాసం యిల్లే వైకుంఠం అనుకుంటారని కలగజేసుకుని, వైద్యుణ్ణి పిలుచుకొచ్చాను''.

సరస్వతమ్మ యినపగరిట చిప్పను నిప్పుపైన చూపి, సూర్యుని వేపు చూపి రాజామణి దవడమీద బెందడులాగా వున్న యెండిన సున్నం మీద రాచింది.

అయిదు నిమిషాలకల్లా సున్నం బిళ్లలు బిళ్లలుగా వూడి పడింది. పేరిన నేయి తెమ్మని సున్నం వూడినచోట మెల్లిగా రుద్దింది.

''చల్లని కాఫీ అని చేస్తారు. చేతనైతే చేసి తెచ్చి యివ్వండి''.

''మాకు రాదు పిన్నిగారూ. మేము వినను గూడా లేదు. చిత్రమే మీ చేతి చలవ సున్నమంతా తేలిగ్గా వూడిపడిందే'' అన్నారు.

''నాకు కాఫీ చాలు. రాజుకి నేచేసి తాగిస్తా పదండి'' అని లేచింది సరస్వతమ్మ.

కోల్డ్ కాఫీ తాగి మెల్లిగా తేరుకుని లేచి కూచున్నది రాజామణి. అప్పుడే లోపలికొచ్చిన భర్త ఆశ్చర్యపోయాడు ''లేచి కూచునేట్టు చేశారే అత్తగారూ! యెప్పుడొచ్చారు?'' అని వెళ్లిపోయాడు.

వంట అయి భోజనానికి కూర్చునే లోపల సరస్వతమ్మ స్నానం జపం కానిచ్చింది. జాజికాయ నూరి మెత్తగా పొడి చేసింది. మంచి బెల్లం పాకం పట్టి జాజికాయ పొడి కలిపి వుడకనిచ్చి మరో మందు కలిపితే చలిమిడి ముద్దలాగా కనిపించింది. చల్లారనిచ్చి బిళ్లలు చేసింది నేతితో.

'' ఇది చప్పరించి తినమ్మా రాజూ. దీని పేరు జాజికాయ గ్రహణి. తగ్గిపోతుందివాళే. మెత్తని అన్నం, పొట్లకాయ యిగురు వేసుకుని తిందువుగాని. హోమియోపతి విరుగుడు కాదు. వెల్లుల్లి లేదు'' అలా వర్ణిస్తూ కబుర్లాడుతూ, యెండు ఆకులో జాజికాయ గ్రహణి పెట్టి యిచ్చి తినిపించింది. తినటమయాక ఆకు రాజామణి తలచుట్టూ తిప్పి పారేసి వచ్చింది సరస్వతమ్మ.

బంధువులూ సాయం చేశారు. సీతమ్మే వడ్డన చేసింది. ''చాలా బావున్నది వంట'' అంటూ భోజనాలు కానిచ్చారు.

రాత్రికి బీరకాయ యిగురు మెత్తని అన్నం తానే వండి రాజామణి చేత తినిపించింది. అందరూ నిద్రకు బడేదాకా, రామకర్ణామృతం, కృష్ణకర్ణామృతం, ముకుంద మాలా, భ్రమర గీతాలూ పాడింది. రాజామణి మంచం పక్కనే నేలమీద కూచుని.

మూడో నాటికల్లా రాజామణి తేరుకుని, తేటైన మొహంతో కనిపిస్తూ లేచి తిరిగింది. తన పనులు తానే చేసుకున్నది.

''వెళ్తాం రాజూ! అమ్మాయి సీతకి యింటి దగ్గరంతా చిన్నపిల్లలే. మొగుడు క్లబ్బుకెళ్లి రాత్రి పదింటికి వస్తాడు. పిల్లలు యెదురుచూస్తూ కూచుంటారు. నాకు మరొకచోట పని వున్నది. బంధువులున్నారు కనిబెట్టి చూస్తున్నారు. తేరుకున్నావు. వ్యాధి నిమ్మళించింది'' అన్నది సరస్వతమ్మ.

సాయంత్రం రైలెక్కారిద్దరూ. రైలు లేటై బయలుదేరే వేళకి పెట్టెలో లైట్లు వెలిగినై. దీపానికి దణ్ణం పెట్టి, డబ్బు లెక్క చూసుకుని సంచీదాచేస్తున్న పిన్నిని చూసి సీతమ్మ నోరుదెరిచింది. కళ్లు పెద్దవైనై. రైలు వేగం అందుకున్నది.

''పెద్ద సోర్సే'' అనుకున్నది సీతమ్మ. రైలు చప్పుడు చేస్తూ వెళ్తున్నప్పుడడిగింది. ''యెప్పుడిచ్చింది పిన్నీ? ఇంటినిండా మనుషులున్నారే!''

''అలా అలవాటు చేశా సీతా! యెవరూ చూడకుండా అందించి పంపేస్తుంది రాజు. ఇంకా వున్నామనుకో. మేయటానికి వచ్చారు అనుకుంటారు బంధువులు. అనుమానించి రాజామణినీ మాటలంటారు''. గుప్త దానం చేశావా? ఈ చేతితో చేసిందా చేతికి తెలియకుండా చేస్తావా?'' అంటారు'' అని నవ్వింది.

6

సీతమ్మ పిల్లలకి రెక్కలొచ్చాయి. పెళ్లిళ్లయాయి. ఆడపిల్లలు డెలివరీలకొస్తారు. బిడ్డనెత్తుకుని వెళ్లిపోతారు. కోడళ్లు గడుసుదేరి పని అందుకుంటూనే వుంటారు. భర్త ప్రైవేటు కంపెనీలో వుద్యోగం చేస్తున్నాడు. పేకాటా సిగరెట్టూ వెలిగిస్తూనే వున్నాడు. ఇల్లు పిల్లలతో సందడిగా వుంటుంది. సీతమ్మే వంట చేస్తుంది. కోడళ్లు వడ్డన చేస్తారు.

''కోడళ్లు చేయరా?'' అనడిగితే, ''వాళ్ల వంట వేరూ నా వంట వేరూ అత్తయ్యా. వాళ్ల వంట నాకు పడదు. కందిపచ్చడి కచ్చాపచ్చాగా రుబ్బుతోంది కోడలు'' అని నవ్వుతుంది.

''యెలా రుబ్బాలీ''

''మొరుం మొరుంగా రుబ్బాలి. జీలకర్ర వేశాక నీళ్ళు చల్లరాదు. వెల్లుల్లి వాడితే ఘాటు. నోరు వాసనా''.

''అందుకా నవ్వుకుంటూ నువే వంట చేస్తావూ?''

''అహహా! అందుక్కాదు కాంతమ్మత్తా, మా సరస్వతమ్మ పిన్నీ ఆవిడ కనిబెట్టే వనరులు, వాటిని సాగుచేయటం, వాడుకోటం గుర్తొచ్చి నవ్వుకుంటాను. దేనికైనా తెలివితేటలు కావాలి''.

''మీ పిన్నితో తిరుగుతుండేదానివిగా? నీకూ అబ్బలేదూ ఆ తెలివితేటలూ? అపుడే వంట మొదలెట్టావేం?

''చూపు ఆనటం లేదు వదినగారూ. త్వరగా కానిచ్చి త్వరగా పెట్టేయమంటా. తర్వాత నేను. యేడున్నరకల్లా అయిపోవాలి. మూతలుంచి సన్న సెగనుంచుతా ఆయనొచ్చాక కోడలు వడ్డిస్తుంది. యేమడిగారూ? పిన్ని తెలివితేటలు నాకూ అబ్బలేదనా? ట్రై చేశా. నొల్లుకొద్దామని చూస్తే, పిన్ని లేకుండా వెళ్తే, తీపిమాటలూ, మర్యాదలూ చెల్లించారు. అంతే'' అని నవ్వింది.

''నే తరుగుతా దొండకాయలూ కత్తిపీటా యిటు జరుపు. చక్రల్లా పొడూగ్గా నా చిన్న ముక్కలా వేపడమా? సరస్వతమ్మ మునపటికన్న బిజీగా కనపడుతున్నదే? లక్షలు తిరుగుతాయామె చేతిలో అని చెప్పుకుంటున్నారు''.

''వేపడమేనత్తయ్యా కోడలు చివరికి బెల్లం చల్లుతుంది. నేను కూరపొడి చల్లుతాను. నీవు విన్నది నిజమే వదినా. మునుపు పదీ, పాతికా నూరు వరకూ అప్పులిచ్చి నోటినే లెక్కలు కట్టేది పిన్ని. నమ్మవేమో యిపుడు వేలల్లో యింకా చెప్పాలంటే లక్షల్లోకి జరిగింది బిజినెస్''. వీధి దీపం వెలిగి వసారాలో లైటు పడింది. సీతమ్మ దణ్ణం పెట్టి, లేచి లైటు వేసింది.

''అంత వుంటుందీ రెడీగా? చేబదులే?''

''అహహా నోటు వ్రాయిస్తుంది యిప్పుడు. కళ్ళజోడు ధరిస్తున్నదిగా పిన్నీ.

తానివ్వకపోతే యివ్వగలవారిచేత యిప్పిస్తుందిప్పుడు. యివ్వగల సోర్సెస్సూ కనిపెట్టింది పిన్ని. అంతేగాదు వదినగారూ. యెవరు డబ్బుకోసం యిబ్బందులో వుండి చూస్తున్నారో గూడా కనిబెడుతుంది. చొరవగా వెళ్లి పనిచేసి పెడుతుంది''. సీతమ్మ కంది పచ్చడి రుబ్బటానికూర్చున్నది.

''నువ్వు లే సీతా. నే రుబ్బి పెడతా'' అని అడ్డం వచ్చింది తోడుకోడలు వరస సుశీల.

సీతమ్మలేచి వడియాలు అప్పడాలు తెచ్చి బాణలి పొయ్యిమీది కెక్కించి నూనె పోసింది. ''పొలాలు యిళ్లూ అమ్ముకునే వాళ్లు, సినిమాలు తీసేందుకు షేర్లు వేసేవాళ్లు, వ్యాపారం పెట్టుకునే వారూ అలా వనరులల్లే మనుషులందుతారు పిన్నికి. పనిచేసి పెడుతుందని నమ్మకం యేర్పడి రానిస్తారు. న్యూమోడల్ కారుమీద మోజు పుట్టిన ఆసామీ వద్ద మూడు లక్షలే వున్నాయట. యింకా రెండు లక్షలు కావాలిట. ఆయన భార్యకి మేడవున్నదనీ, ఆయనకి రెండెకరాల పొలమున్నదనీ చూపి యిప్పించింది. రాతకోతలు దగ్గరుండే చేయించింది పిన్ని. లాయర్లు మరొక సోర్స్. పని చూపినందుకు ఫిఫ్టీ, ఫిఫ్టీ అని ఒప్పందం వుంటుంది'' అలా నవ్వుతూ పిన్ని ప్రతాపం చెప్తుతుండగా వంటైపోయింది. రకరకాల వడియాలు, అప్పడాలు వేయించింది. పిల్లలు వచ్చేశారు. కోడళ్లు పళ్లాలు, మంచినీళ్లూ పెట్టి వడ్డన చేశారు. పిల్లల భోజనాలైనై. చోటు శుభ్రం చేశారు.

''వెళ్తాం సీతా!'' అని లేచారు బంధుగులు యిరుగమ్మ పొరుగమ్మ.

''అబ్బే! వీలులేదు. అరిటాకులున్నాయి. తడిబట్టలు కావాలా పట్టు చీరలా?'' అని నవ్వింది సీతమ్మ.

కోడళ్లు కొసాకులు పరిచి పీటలు వేశారు.

మొహమాటపడకుండా పీటలమీద కూచుని అతిధులన్నారు.

''యెంత పెద్దమనసే సీతా నీదీ? కడుపారా బిడ్డలని గనటమే గాకపెంచిపెద్ద చేశావు అంతా బావున్నారు. భోగభాగ్యాలూ చాతుర్యమూ లేకపోతేనేం''

సీతమ్మ ఆప్యాయంగా కొసరి కొసరి వడ్డన చేసింది.

''అన్నీ చాలా రుచి. చిక్కని మజ్జిగ. నంజుకునేందుకు వూరగాయ ముక్కలు. విందులాగా వున్నది సీతమ్మా'' అలా రివార్కులు దొర్లించారతిథులు. లేచారు. కూరపాదుల్లో చేతులు కడుక్కున్నారు.

''వస్తాం సీతా. పండగలాగా గడిచిందివాళ'' అని వక్క పలుకులు నవులుతూ వెళ్లారతిథులు.